కొనసాగుతున్న సోదాలు

తనిఖీ చేస్తున్న పోలీసులు

జిల్లా విలేకరుల యంత్రాంగం: నేర, నియంత్రణ, గంజాయి, మద్యం అక్రమ రవాణా, నిల్వలు గుర్తించేందుకు శనివారం ఉదయం జిల్లాలోని కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు, మందస, కంచిలి పోలీస్‌స్టేషన్ల పరిధిలో సిఐలు, ఎస్‌ఐల ఆధ్వర్యాన సిబ్బంది సోదాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనాలు వాహన పత్రాలు తనిఖీ చేసి సరైన రికార్డులు లేని, అనధికార వాహనాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి, మద్యం, నాటుసారా, మందుగుండు సామగ్రి అక్రమ నిల్వాలపై సోదాలు చేశారు. కొత్త అనుమానిత గల వ్యక్తులపై ఆరా తీసి నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టు వేస్తున్న జిల్లా పోలీసులు తెలిపారు.

నేటి నుంచి డిపోల్లో సరుకులు

జిల్లాలో ఆదివారం నుంచి చౌక ధరల దుకాణాల్లో రేషన్ సరుకులు పంపిణీ కానున్నాయి. ఇప్పటివరకు మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ (ఎండియు) వాహనాల ద్వారా నిత్యవసర సరుకులను అందించేవారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఇటీవల ఎండియు వ్యవస్థను రద్దు చేసింది. చౌకధరల దుకాణాల ద్వారా సరుకులను అందించాలని నిర్ణయించింది. అందుకు సంబంధించి ఇటీవల పలుమార్గదర్శకాలను వెలువరించింది. డిపోల ద్వారా సరుకులను అందించేందుకు అధికారులు అన్నీ ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇతర నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారు వీటిని ప్రారంభించనున్నారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

- **1603 షాపులు సిద్ధం చేసిన అధికారులు**
- **వికలాంగులు, 65 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇళ్ల వద్దకే...**
- **ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులతో ప్రారంభం**

జిల్లా వ్యాప్తంగా 1,603 రేషన్ డిపోలు ఉన్నాయి. వాటిలో 1,592 చోట్ల ఈ-పోస్ యంత్రాల ద్వారా సరుకులను పంపిణీ చేయనున్నారు. మిగిలిన 11 డిపోలు మారుమూల ప్రాంతాల్లో ఉండటం, సిగల్స్ సమస్య కారణంగా ఆ పరిధిలో ఉన్న లబ్ధిదారులకు ఆఫ్‌లైన్‌లో సరుకులు అందించనున్నారు. సరుకుల పంపిణీకి డిపోలకు ఈ-పోస్ యంత్రాలు సరఫరా చేశారు. ఇప్పటివరకు వాహనాల ద్వారా సరుకులు అందిస్తుండటంతో ఆపరేటర్లకే అథంటికేషన్ ఉండేది. ఇప్పుడు వారి స్థానంలో డీలర్లకు బాధ్యతలను అప్పగించారు. రేషన్ ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు ఓ ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. దానికి ఈ-పోస్‌లను అనుసంధానం చేశారు. మరో వైపు రేషన్ దుకాణాలు, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. కార్డుదారుల్లో సీనియర్ సిటిజన్లతో ప్రారంభించాలని ప్రభుత్వం పేర్కొంది.

లావేరు : రేషన్ డిపోను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ప్రత్యేక కేటగిరీ వారికి ఐదో తేదీలోపే సరుకులు

రేషన్ డిపోల నుంచి సరుకులు తీసుకువెళ్లడంతో ఇబ్బందులు పడతారన్న ఉద్దేశం ప్రభుత్వం వికలాంగులు, 65 ఏళ్లు పైబడిన వారికి ప్రత్యేక కేటగిరిగా పరిగణించింది. అటువంటి ఇళ్లకే వెళ్లి సరుకులు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లాలో 75,120 మందికి ఇళ్ల వద్దకే సరుకులను అందించనున్నారు. వీరికి ఐదో తేదీలోపే సరుకులను అందించాలని ప్రభుత్వం నిర్దేశించింది.

సరుకుల పంపిణీ సమయవేళలు ఇవే

జిల్లాలో 1603 డిపోల పరిధిలో 6,60,375 కార్డులు ఉన్నాయి. వీటిలో 19, 39,108 మంది సభ్యులుగా ఉన్నారు. వీరికి 9,625 మెట్రిక్ టన్నుల బియ్యం, 320 మెట్రిక్ టన్నుల పంచదార సిద్ధం చేశారు. లబ్ధిదారులకు అందించాల్సిన సరుకులను ఇప్పటికే ఎంఎల్ఎస్ (మండల లెవెల్ స్టాక్ పాయింట్స్) నుంచి డిపోలకు తరలించారు. ప్రభుత్వం వెలువరించిన మార్గదర్శకాలు ప్రకారం సరుకులను రోజూ ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు పంపిణీ చేయనున్నారు. ప్రతినెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు సరుకులు తీసుకునేందుకు ప్రభుత్వం లబ్ధిదారులకు అవకాశం కల్పించింది.

పచ్చని ఉద్దానంలో

కార్గో ఎయిర్ పోర్టు విధ్వంసం వద్దు

సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి- మందస

కార్గో ఎయిర్ పోర్టుకు వ్యతిరేకంగా దశల వారి పోరాటాన్ని ఉధృతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు పిలుపునిచ్చారు. మండలంలోని బిడిమిలో కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా శనివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల భూములను బలవంతంగా తీసుకొని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడితే అభివృద్ధి ఎలా అవుతుందని ప్రశ్నించారు. మౌనం వీడి కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్దానం ప్రాంతంలో లక్షలాది చెట్లు కార్గో ఎయిర్పోర్టు పేరుతో తొలగిస్తే పలాసతో పాటు శ్రీకాకుళం జిల్లాకు తీరని ముప్ప ఏర్పడుతుందన్నారు. దీనివల్ల పర్యావరణానికి తీవ్ర హాని కలగదా? అని ప్రశ్నించారు. పలాస నుంచి బయలుదేరే పాసింజరు రైళ్లు రెండు, విశాఖ ఎక్స్‌ప్రెస్, బరంపురం, భువనేశ్వర్‌కి తీసుకెళ్లినప్పుడు రవాణా కోసం ప్రజలు ఇబ్బంది పడుతుంటే మీరు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఇదేనా మీరు చేసిన అభివృద్ధి అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడితే సహించేది లేదని హెచ్చరించారు. కార్పొరేట్ కంపెనీలు ప్రయోజనం కోసం ఉన్నాయా? ప్రజల ప్రయోజనాల కోసం ఉన్నాయా? అని ప్రశ్నించారు. బలవంత భూ సేకరణకు వ్యతిరేకంగా సముద్రతీరా ప్రాంతాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి వ్యతిరేకంగా ప్రజల మద్దతుతో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి చెందాలంటే వంశధార రిజర్వాయరు పూర్తి చేసి చివరి భూముల వరకు రెండు పంటలకు నీరు అందించాలన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరు పూర్తి చేసి పలాస పట్టణానికి తాగునీరు, మూడు మండలాలకు సాగునీరు అందజేయాలని డిమాండ్ చేశారు. జీడికి గిట్టుబాటు ధర కల్పించాలని, అలాగే జీడి బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కళాకారులు పదంపాడుతూ కదం తొక్కారు. కార్యక్రమంలో కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు, కార్యదర్శి జోగి అప్పారావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లానా యకులు జుట్టు వీరస్వామి, గోరకల బాలకృష్ణ, సిఐటియు నాయకులు ఎన్.గణపతి, జీడి రైతు సంఘం కార్యదర్శి తెప్పల అజయ్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు మామిడి మాధవరావు, జోగి కోదండరావు, కోనేరు రమేషు, కొర్ల రామారావు చౌదరి, నల్ల హడ్డి వెంకటరావు, నీలకంతం, బిడిమి సర్పంచ్ పొట్టి ధర్మారావు, జోగి శ్రీదేవి, తెప్పల గున్నయ్య, ఈరోతు కృష్ణారావు, జుట్టు గున్నయ్య, తెప్పల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర చేస్తున్న నాయకులు

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అంటు వ్యాధుల వ్యాపించకుండా పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టిసారించాలని టిడిపి కౌన్సిలర్ ఆసి లీలారాణి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. డస్ట్ బిన్‌ల్లో వేస్తున్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. కుక్కల బెడద నివారణ చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. పురపాలక సంఘంలో అక్రమణలు, అక్రమ నిర్మాణాలు అరికట్టడంలో అవసరమైన పనిముట్లు ప్రొక్లెయిన్, డిల్లింగ్ మిషన్, హాడ్రోలిక కంపసర్ తదితర పరికరాలు ఎస్ఎస్ఆర్ ధరలకు అద్దె ప్రాతిపదికన తెచ్చేందుకు కౌన్సిల్ ఎజెండలో పెట్టారు. దీనిపై వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి అభ్యంతరం వ్యక్తం చేస్తూ సంబంధిత పత్రాన్ని కమిషనర్ రమేష్‌కు అందజేశారు. గత రెండేళ్లు అక్రమ నిర్మాణాలపై కేసులు నమోదు చేయకుండా ఉండడం సరికాదన్నారు. వేసిన కేసులకు సంబంధించిన మున్సిపల్ న్యాయవాది, హైకోర్టులో స్టాండింగ్ కౌన్సెల్ ఉన్నా ఎందుకు ఉపయోగించడం లేదని ప్రశ్నించారు. టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్‌ప్రసాద్ సమాధానం ఇస్తూ... అన్ని ఆక్రమణలపై కేసులు నమోదు వేయలేదని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఎన్ని ఆక్రమణులు ఉన్నాయో గుర్తించారా? లేనప్పుడు ఎందుకు అనవసరంగా అక్రమణులు తొలగింపు పరికరాలు అద్దె ప్రాతిపదికన తీసుకొస్తున్నారని వైసిపి కౌన్సిలర్ బచ్చు జగన్ ప్రశ్నించారు. సమావేశంలో చర్చ జరుగుతున్న సమయంలో ఆమోదం చేయడంతో చైర్‌ఫర్సన్ తీరును కౌన్సిలర్ లీలారాణి తప్పుపట్టారు. అనంతరం పలు అంశాలు కౌన్సిల్ ఆమోదించింది. సమావేశం శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

విభాగాల సమన్వయంతోనే ఉత్తమ ఫలితాలు

● జిల్లాల మధ్య పోటీ పెరిగింది ● జిల్లా ప్రత్యేక అధికారి శశిభూషణ్ కుమార్

సమీక్షిస్తున్న శశిభూషణరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రస్తుతం జిల్లాల మధ్య కేవలం సహకారం మాత్రమే కాకుండా, అభివృద్ధిలో ఆరోగ్యకరమైన పోటీ కూడా పెరిగిందని జిల్లా ప్రత్యేక అధికారి, పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో కలెక్టర స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన శనివారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తలసరి ఆదాయం, జీడీపీ వద్ధి వంటి కీలక సూచికలలో జిల్లా గణనీయంగా పురోగమిస్తోందని వెల్లడించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు పంట వైవిధ్యాన్ని, డ్రోన్ సాంకేతికత వినియోగాన్ని వివరించారు. పాడి అభివృద్ధికి గోకులాల ఏర్పాటు, పరిపుష్టాహార పంపిణీ, సెక్స్ సార్టెడ్ సీమెన్ ద్వారా ఆడ దూడల ఉత్పత్తిని ప్రోత్సహించడం, జూన్ నుంచి డిసెంబర్ వరకు ఆయిల్ పామ్ సాగు ద్వారా రూ.98 కోట్ల విలువైన వృద్ధిని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఈ-వేస్ట్ అవగాహన, డిజిటల్ మానిటరింగ్ బారువ బీచ్ ఫెస్టివల్‌లో ఈ-వేస్ట్ అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించామని అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సహా జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, వెంకటేష్, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, సిపిఒ లక్ష్మీప్రసన్న, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, డిఎంహెచ్ఒ అనిత, డిటిసి విజయసారథి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా నరసన్నపేట మండలం చిన్నబొరిగివలస పంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన రహదారి పనులను పరిశీలించారు. అలాగే రణస్థలం మండలం బంటుపల్లి పంచాయతీలో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు కలిసి ఇంటింటికీ పింఛను పంపిణీని పరిశీలించారు.

బడుగులపై పిడుగు

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

జిల్లాలో సరుబుజ్జిలి, కొత్తూరు మండలాల్లో శనివారం బడుగులపై పిడుగుపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాలో విషాదం నెలకుంది. వివరాల్లోకి వెళ్తే... సరుబుజ్జిలి మండలంలోని బుడ్డివలసకు చెందిన బూరాడ అప్పలనాయుడు (55) 4.30 గంటల సమయంలో తనకున్న పొలంలో గట్టును చదును చేయటానికి వెళ్లాడు. వ్యవసాయ పనిలో నిమగ్నమై ఉండగా, ఇంతలో మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమైంది. ఒకేసారి చలి పిడుగు అప్పలనాయుడుపై పడటంతో శరీరం చల్లబడి స్పృహ కోల్పోయాడు. గ్రామస్తులు హుటాహుటిన సరుబుజ్జిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య సావిత్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. మృతుతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తహశీల్దార్ ఎల్.మధుసూదన్, డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పిడుగుపాటు ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అప్పలనాయుడు (ఫైల్), సింహాచలం మృతదేహం

కొత్తూరు : మండలంలోని ఆకులుతంపరకు చెందిన గొర్రెల కాపరి పి.సింహాచలం (79) శనివారం పిడుగుపాటుకు గురై మృతి చెందారు. సింహాచలం తన గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములతో కూడిన పిడుగు ఆయనపై పడడంతో ఘటనాస్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య పున్నమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

5న జాతీయ లోక్ అదాలత్

పలాస : ఈ నెల 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పలాస సివిల్ కోర్టు జడ్జి మాధురి తెలిపారు. పలాస కోర్టును స్థానిక తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న పాత ఎస్ఎఫ్ ఎస్ పాఠశాల భవనంలోకి శనివారం మార్పు చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి కార్యాలయంలో మహిళల రక్షణకు ఇంటర్నల్ కమిటీ వేయాలన్నారు. మున్సిపాలిటీలో ఎక్కడైనా అనాథ పిల్లలు, వదిలేసిన పిల్లలు ఉంటే వారిని గుర్తించి వారందరికీ ఆధార్ కార్డు అందజేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్, ఉపాధ్యక్షులు బి.కేర్ పట్నాయక్, జాయింట్ సెక్రెటరీ జిఎంఎస్ అనిల్‌రాజ్, ఎజిపి పిండి వెంకటరావు, పైల రాజరత్నం నాయుడు, తాండ్ర మురళి, విగ్నేష్, రవికుమార్, చంద్రశేఖరరావు, సుధారాణి, రవి పట్నాయక్, చిట్టిబాబు లోకేష్, తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, ఎంపిడిఒ వసంతరావు, డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠ రావు, ఎంఇఒ శ్రీనివాస్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ యు.లత, కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ, వజ్రపుకొత్తూరు ఎస్ఐ నిహార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి మాధురి

పొగాకు వినియోగాన్ని పారద్రోలాలి

డిఎంహెచ్ఒ అనిత

ప్రజాశక్తి- శ్రీకాకుళం

గ్రామాల్లో పొగాకు వినియోగాన్ని పారద్రోలాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని అనిత జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ర్యాలీ అనంతరం ఏడు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యా సంస్థను పొగాకు రహిత విద్యాసంస్థలగా ప్రకటించడం, గ్రామాల్లో పొగాకు వినియోగాన్ని రూపుమాపే దిశగా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సిగరెట్, పొగాకు ఉత్పత్తుల చట్టం-2003ను కఠినంగా అమలు పరచడం కోసం తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీకాంత్, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మేరీ కాథరిన్, ఎన్‌సిడిపిఒ డాక్టర్ ఇప్పిలి వెంకటరావు, డిఐఒ డాక్టర్ రాందాసు, డిఐఎంఒ డాక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ అనిత

రూ.69లకే అచ్చెన్నలో ఆనందం వచ్చెన్

వీక్షణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం క్వింటా వరికి రూ.69 మద్దతు ధర ప్రకటించిన తర్వాత వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులో ఎక్కడా లేని ఆనందం వచ్చినట్లుగా కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం 14 రకాల పంటలకు మద్దతు ధర ప్రకటించిన వెంటనే హర్షం వెలిబుచ్చుతూ ప్రకటన విడుదల చేశారు. మద్దతు ధర రాష్ట్ర రైతాంగానికి పెద్దఎత్తున ప్రయోజనం కలుగుతుందంటూ కేంద్ర ప్రభుత్వానికి ఏకంగా కృతజ్ఞతలు తెలిపేశారు. గతేడాది మోడీ సర్కారు క్వింటా వరికి రూ.117 ప్రకటిస్తే... ఈ సారి రూ.48లు తగ్గించి రైతులకు కోత పెట్టిన విషయం అమాత్యులు మరిచినట్టు ఉన్నారు. ఎప్పుడూ గతాన్ని తలుచుకుంటూ, వైసిపి ప్రభుత్వం విధానాలను నామస్మరణ చేసే అచ్చెన్నాయుడు మద్దతు ధర విషయంలో మాత్రం గతంగత: అన్నట్లుగా వదిలేసినట్లు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం వరికి మద్దతు ధర పెంచలేదు సరికదా.. నిరుడు కంటే తగ్గించడం, అందులోనూ బిజెపి భాగస్వామ్యంతో ఉన్న ప్రభుత్వం ఇక్కడ అధికారంలో ఉండటం కూటమి నేతలకు కొంచెం ఇబ్బంది పెట్టే అంశమే. సాధారణంగా గతం కంటే తమకు వేతనం పెరిగిన సందర్భంలో ఉద్యోగులు, కార్మికులు, కూలీలు తమ ఆనందాన్ని వెలుబుచ్చుతారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఈ విషయంలో రివర్స్‌లో ఉన్నట్లు కనిపిస్తోంది. వ్యవసాయ కుటుంబం నుంచి తాను వచ్చానని, రైతుల కష్టాలు తెలుసునంటూ పదే పదే వేదికలపై చెప్పే మంత్రి క్వింటా వరికి రూ.69 సరిపోతుందని ఎలా అనుకుంటున్నారు? వ్యవసాయ ఖర్చులు ఏటికేడు పెరుగుతున్న విషయం అచ్చెన్నకు తెలియదా? గత ఏడాది రైతులు దుక్కులకు రూ.2,600లు చెల్లిస్తే ఈ సంవత్సరం రూ.3,600కు చేరింది. వారు మద్దతిస్తున్న కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వమే ఎరువులపై సబ్సిడీ ఎత్తేసి, పురుగు మందులు ధరలు, డీజిల్ ధరలను మరోవైపు పెంచడంతో నిరుడుతో పోలిస్తే వాటి ధరలూ పెరిగాయి. ఇలా అన్ని ధరలూ పెరుగుతుంటే వరికి మద్దతు ధరను తగ్గించిన కేంద్రానికి అచ్చెన్న కృతజ్ఞతలు తెలపడం విడ్డూరంగా ఉంది. కేంద్రంలో తాము మద్దతు ఇచ్చిన ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకూడదనో లేక మోడీ మనసుకు బాధ కలిగించకూడదనో కేంద్ర నిర్ణయంపై అచ్చెన్న హర్షం వ్యక్తం చేయొచ్చు గాక కాని మోడీ సర్కారు ప్రకటించిన మద్దతు ధర మాత్రం తమను అవమానపరిచేదిగానే ఉందని రైతులు అనుకుంటున్నారు.

కడపలో నిర్వహించిన మహానాడుకు ముఖ్యనేతలు, ద్వితీయ శ్రేణి నాయకులు తరలివెళ్లడంతో జిల్లాలో ఎన్‌టిఆర్ జయంతోత్సవాలకు కళ తప్పుతుందని ప్రభుత్వం భావించినట్లుగా ఉందో ఏమో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్‌టిఆర్ విగ్రహాలకు నివాళ్లు అర్పించే కార్యక్రమంలో ప్రభుత్వం అధికారులను భాగస్వామ్యం చేసింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కచ్చితంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశాలు సైతం జారీ చేసింది. ఉమ్మడి ఎపికి ముఖ్యమంత్రిగా ఎన్‌టిఆర్ అందించిన సేవలను ప్రజలకు గుర్తు చేయడం మంచిదే. బహుశా టిడిపి కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ ఒరవడిని అమలు చేసినట్లుగా కనిపిస్తోంది. గత వైసిపి సర్కారు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతి రోజైన జూలై ఎనిమిదిన రైతు దినోత్సవంగా జరపడంతో పాటు ఉత్తమ రైతుల పేరిట అవార్డులను సైతం ప్రకటించింది. ఆ నేతలకు ప్రజల్లో ఇప్పటికి చెక్కు చెదరని అభిమానం ఉందనో లేక రాజకీయంగా తమకు ఉపయోగపడుతుందనో భావిస్తున్న పాలకులు వారి జయంతోత్సవాలను ఘనంగా జరుపుతూ వారి సేవలను స్మరించుకుంటున్నారు. ఇదే క్రమంలో జాతీయోద్యమ సమయంలో నాటి సమాజంలో నెలకొన్న రుగ్మతలపై పోరాడిన సంఘ సంస్కర్తలను స్మరించుకోవడానికి పాలకులు ఇష్టపడటం లేదు. బాల్య వివాహాలు, వరకట్నం వంటి సామాజిక దురాచారాలపై తన రచనలతో దునుమాడిన గురజాడ అప్పారావు వంటి మహాకవిని జయంతి రోజైన సెప్టెంబరు 24ను సంస్మరణ దినోత్సవాల జాబితాలో ప్రభుత్వం చోటు కల్పించకపోవడం చూస్తే రాజకీయంగా తనకు ఏ మాత్రం ప్రయోజనం ఉండదని భావిస్తున్నట్లుగా ఉంది. స్త్రీ విద్య, బాలికల కోసం పాఠశాలలు ప్రారంభించి సంఘ సంస్కర్తగా పేరొందడంతో పాటు తెలుగు పునరుజ్జీవనోద్యమ పితామహుడిగా భావించే కందుకూరి వీరేశలింగం జయంతి (ఏప్రిల్ 16) రోజును జరపడానికి పాలకులు ఇష్టపడటం లేదు. సామాజిక ప్రయోజనాలే లక్ష్యంగా రచనలు సాగించి సహస్రాబ్ది కవిగా పేరొందిన గుర్రం జాషువా జయంతి (జూలై 24) కూడా పాలకులకు గుర్తు రావడం లేదు. కవులు, సాహితీ సంస్థలు చివరకు విద్యా సంస్థల్లో సైతం వీరి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను జరిపి సేవలను గుర్తు చేసుకుంటుండగా పాలకులు మాత్రం వీరిని విస్మరిస్తోంది. ముఖ్యమంత్రులకు రాజకీయ నేపథ్యం ఉంటుంది. వారిని కొంత మంది అభిమానిస్తే, వారి విధానాలు నచ్చక మరికొందరు ద్వేషిస్తుంటం మనం చూస్తున్నాం. మాజీ ముఖ్యమంత్రులు ఎన్‌టిఆర్, వైఎస్‌ఆర్ ఇరువురూ ఆయా సందర్భాల్లో ప్రజల తిరస్కారానికి గురైన వారే. కవులు, సంఘ సంస్కర్తలు ప్రజల అందరి మన్ననలను పొందిన వారు. అటువంటి వారి జయంతోత్సవాలను జరిపి భావితరానికి వారిని గుర్తు చేయాల్సిన బాధ్యత పాలకుల ఉంది. ఇప్పటికయినా అటువంటి మహనీయుల సేవలను గుర్తించి వారి జయంతోత్సవాలను అధికారిక సంస్మరణ దినాల జాబితాలో ప్రభుత్వం చేర్చగలదని అంతా ఆశిద్దాం.

CHANGE OF NAME

I, JC 443342P Rank NB SUB Name **VASANTHA RAO PINNINTI** presently residing at Kuntibhadra-Vill, Sirusuvada-Post, Kotturu Mandalam, Srikakulam-Dist, Andhra Pradesh-State, Pin-532455 have changed my son name from **P. NAVADEEP** to **PINNINTI NAVADEEP** vide Affidavit dated 30.04.2025 before Junior Civil Judge court Kotturu.

CHANGE OF NAME

I, JC 443342P Rank NB SUB Name **VASANTHA RAO PINNINTI** presently residing at Kuntibhadra-Vill, Sirusuvada-Post, Kotturu-Mandalam, Srikakulam-Dist, Andhra Pradesh-State, Pin-532455 have changed my daughter name from **P. DEEKSHA** to **PINNINTI DEEKSHA** vide Affidavit dated 30.04.2025 before Junior Civil Judge court Kotturu.

CHANGE OF NAME

I, **P. LATHA** is legally wedded spouse of JC 443342P Rank NB SUB Name VASANTHA RAO PINNINTI presently residing at (Kuntibhadra-Vill, Sirusuvada-Post, Kotturu Mandalam, Srikakulam-Dist, Andhra Pradesh-State, Pin-532455) have changed my name from **P. LATHA** to **PINNINTI LATHA** vide Affidavit dated 30.04.2025 before Junior Civil Judge court Kotturu

IN THE HON'BLE COURT OF THE V ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT : VISAKHAPATNAM O.S. 1460/2024

Between:
M/s. Varun Finance, Rep.by its Special Power of Attorney Holder, Kondra Anand ... Plaintiff
And:
Sri Jami Anil Kumar & another ... Defendants

SUMMONS

To,
D-1: Sri Jami Anil Kumar, S/o. Kasi Raju, R/at D.No.1-154, Kapu Veedhi, Lukulam, Narsanapeta, Near Anjaneya Swami Temple, Srikakulam-532425.
D-2: Sri Potnuru Veera Venkata Satish S/o. Bhema Sankara Rao, R/at D.No.1-58, Main Veedhi, Near Govt. School, Boddam, Srikakulam-532430.

Please take notice that the above named plaintiff has instituted the above suit against both of you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **16-06-2025** for your appearance on that day **10:30 A.M.** you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be heard and determined in your absence.

(By Order of the Hon'ble Court)
TULALA VENKATESWARA RAO, KURUMUJI KOTESWARA RAO,
Advocates, Visakhapatnam-02
Cell: 9985747149.

IN THE HON'BLE COURT OF THE XII ADDL.DISTRICT JUDGE AT: VISAKHAPATNAM I.A. 450/2024 in O.S.246/2011

Between:
Allada Saraswathi @ Polamarasetti Saraswathi & another ...Petitioners/Plaintiffs
And:
Allada Seetha & others ...Respondents/Defendants

NOTICE

To,
R-3: Challa Padmavathi, W/o. Sudhakar, Hindu, aged 62 years, Housewife, R/at P & T Colony, Rajahmundry, East Godavari District
R-4: Nakkina Varalakshmi, W/o. Sivakumar, Hindu, aged 48 years, Housewife, R/at. Ranasthalam, Srikakulam.

Please take notice that the above named petitioners/plaintiffs has instituted the above I.A. against both of you and the Hon'ble Court was pleased to order notice to R-3 & R-4 and the matter stands posted to **18-06-2025** for your appearance on that day **10:30 A.M.** you should appear before the afore said Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be heard and determined in your absence, ex-parte as per law.

(By Order of the Hon'ble Court)
G. PRASADA RAO,
Advocate
Visakhapatnam,
Cell: 9248544949.

సన్మానిస్తున్న అదనపు ఎస్‌పి రమణ

పోలీస్ సేవలు చిరస్మరణీయం

అదనపు ఎస్‌పి కె.వి.రమణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సుదీర్ఘకాలంగా వృత్తి రీత్యా జిల్లా పోలీసు శాఖకు అందించిన సేవలు చిరస్మరణీయమని అదనపు ఎస్‌పి కె.వి.రమణ అన్నారు. జిల్లా పోలీసు శాఖలో పని చేస్తూ శనివారం ఉద్యోగ విరమణ పొందుతున్న స్పెషల్ బ్రాంచ్ సబ్ ఇనస్పెక్టర్ కె.మన్మథరావు, ఆమదాలవలస అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు వై.జగన్నాథరావు, ఎ.శ్యామలరావు, కానిస్టేబుల్ వై.శ్రీనివాసరావును సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు ఉద్యోగంలో అహర్నిశలు ప్రజా రక్షణ, సేవలకు ఎక్కువ సమయాని కేటాయించారని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడిపి శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఆర్‌ఐ నర్సింగరావు, ఆర్‌ఎస్‌ఐ హరనాథ్, ఎస్‌బి ఎస్‌ఐ రమణ, పోలీసు కార్యాలయం సూపరింటెండెంట్లు బాలరాజు, లిల్లీబాయ్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కృష్ణనాయుడు, ట్రెజరర్ కె.భుజంగరావు పాల్గొన్నారు.

ఢిల్లేశ్వరరావు, పద్మ దంపతులను సన్మానిస్తున్న ఎంఇఒలు

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారు

ప్రజాశక్తి- పలాస

36 ఏళ్లుగా పనిచేస్తూ... ఎంతో మంది విద్యార్థులకు తీర్చిదిద్ది ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన వ్యక్తి లఖినాన ఢిల్లేశ్వరరావు అని ఎంఇఒలు సిహెచ్.శ్రీనివాసరావు చెరుకుపల్లి సత్యం అన్నారు. కాశీబుగ్గ పద్మనాభపురం కాలనీ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఢిల్లేశ్వరరావు శనివారం ఉద్యోగ విరమణ చేపట్టారు. అనంతరం ఢిల్లేశ్వరరావు, పద్మ దంపతులకు దుశ్శాలువ కప్పి సన్మానించి మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ పాఠశాలలను బలోపేతం చేయడం, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేసిన వ్యక్తి ఢిల్లేశ్వరరావు అని కొనియాడారు. ఢిల్లేశ్వరరావు మాట్లాడుతూ తాను ఉద్యోగ విరమణ చేసినా విద్యార్థులకు నా వంతుగా విద్యను అందించి సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేయడమే కాకుండా యుటిఎఫ్ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో గున్న మధుసూదనరావు, కంచరాన ప్రసాదరావు, గుంట కోదండరావు, బల్ల చిట్టిబాబు, కంచరాన జయరాం, కంచరాన రమేష్, గొర్లె నాగేశ్వరరావు, చందు, బెండి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశాఖ ఎ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజలు వచ్చి ఎమ్మెల్యేకు వినతిపత్రాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరి సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపిస్తామన్నారు. కూటమి పాలనలో అందరికీ సమన్యాయం జరుగుతుందన్నారు. గత ఐదేళ్లలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించక పోవడంతో పెద్ద ఎత్తున నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు అందుతున్నాయన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యం, విద్యుత్, డ్రైన్లు, సాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వినతులు అందుతున్నాయని వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కించే దిశగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మాలతికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పత్రాన్ని అందుకుంటున్న మాలతి

నగరానికి చెందిన సనపల మాలతికి డాక్టరేట్ లభించింది. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో జంతు శాస్త్ర విభాగానికి చెందిన ఆమె చేసిన పరిశోధనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆచార్య యు.షమీమ్ పర్యవేక్షణలో మాలతి ప్రివలెన్స్ యాండ్ టాక్సోనోమి ఆఫ్ గ్యాస్ట్రోయింటెస్టినల్ హెల్మిస్తె పారాసైట్స్ ఆఫ్ డమ్మిస్టిక్ రుమినెంట్స్ ఫ్రొం విశాఖపట్నం అండ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఇండియా అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు సంబంధించిన పత్రాలు జాతీయ స్థాయి జర్నల్స్‌లో ప్రచురించడమే కాకుండా, పలు జాతీయ సదస్సుల్లో పోస్టర్లగా ప్రదర్శనలు ఇచ్చారు. ఈ పరిశోధనకుగాను మాలతికి డాక్టరేట్ లభించింది. ఆంధ్ర విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.పి రాజశేఖరం చేతులమీదుగా డాక్టరేట్‌కు సంబంధించిన నోటిఫికేషన్‌ను అందుకున్నారు. జంతుశాస్త్ర విభాగంలో పరిశోధన చేసిన మాలతిని ఆ విభాగం అధ్యాపకులు, సిబ్బంది, కుటుంబసభ్యులు అభినందించారు. తాను పరిశోధన పత్రం సమర్పించేందుకు అన్ని విధాలుగా సహకరించిన, అవకాశం కల్పించిన ఆంధ్ర విశ్వ విద్యాలయం అధికారులకు మాలతి కృతజ్ఞతలు తెలిపారు.

అన్ని డిపోల్లో సరుకుల పంపిణీ

రేషన్ డిపోను తనిఖీ చేస్తున్న తహశీల్దార్ రాజశేఖర్

లావేరు: మండలంలోని 58 రేషన్ డిపోల్లో బియ్యం, పంచదార వంటి సరుకులు పంపిణీ చేయాలని లేకుంటే డీలర్లపై చర్యలు తప్పవని తహశీల్దార్ మంగం రాజశేఖర్ హెచ్చరించారు. శనివారం మండలంలోని ఎల్‌ఎన్‌పురం డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1 నుంచి అన్ని డిపోల్లోను సరుకులు పంపిణీ చేసి కార్డుదారులకు సరుకులు ఇవ్వాలన్నారు. డిపోల్లో తప్పనిసరిగా బోర్డులు ఏర్పాటు చేయాలని, కార్డుదారులను డీలర్లు గౌరవ ప్రధంగా చూడాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి డీలర్లు సేవలు అందించాలన్నారు. అన్ని డిపోల్లో తనిఖీ పూర్తయిందన్నారు. తహశీల్దార్ వెంట విఆర్‌ఒ శ్రీనువాసరావు, సిఐ భాస్కరరావు ఉన్నారు.

చినుకు పడితే చిత్తడే..!

- బురదమయంగా రహదారులు
- పట్టించుకోని అధికారులు

రహదారి మధ్యలో దిగబడిన ఆటో

బురదమయమైన పాపారావుపేట రహదారి

ప్రజాశక్తి- రణస్థలం

ఏళ్ల తరబడి రోడ్లకు మరమ్మతులు చేయకపోవడం, ఇటీవల కురిసిన వానలకు మండల, గ్రామ రహదారులైతే మరీ అధ్వానంగా తయారయ్యాయి. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. రాత్రివేళల్లో సరిగా కనిపించక గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పలుచోట్ల ద్విచక్రవాహనంపైనే కాదు.. కనీసం నడిచి వెళ్లే పరిస్థితి కూడా లేదు. మండలంలోని తెప్పలవలస నుంచి పాపారావుపేట వరకు వెళ్లే రహదారి గుంతలు పడి ప్రయాణించడానికి వీలులేకుండా తయారైంది. రోడ్డు మొత్తం గుంతలమయం కావడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు చేరి బురదతో ఎక్కడ గుంతలున్నాయో.. ఎక్కడ రోడ్డు ఉందో తెలీని పరిస్థితి. దీంతో పలువురు వాహనదారులు గుంతలో పడి గాయాలైన సంఘటనలూ లేకపోలేదు.. వాహనాల్లో ప్రయాణం సరికదా.. కనీసం నడవడానికి కూడా ఈ రోడ్డు ఇబ్బందిగా ఉంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. కనీసం గ్రామస్తులు నడిచివెళ్లే పరిస్థితి కూడా లేదు. వర్షాలకు మట్టి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడి ప్రయాణమే నరకప్రాయంగా తయారయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేసి గ్రామస్తుల సమస్యలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోండయ్యా..

ప్రస్తుతం కురుస్తున్న వానలకు రోడ్డుపై నీళ్లు నిలిచి ఎక్కడ చూసినా గుంతల్లో నీరు చేరి ప్రయాణించాలంటే ఎక్కడ గుంత ఉందో తెలీక ప్రజలు భయపడుతున్నారు. ఈ రోడ్డుపై స్థానికులు ప్రయాణం సాగించాలంటే ఎప్పుడు ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఇక నడిచి వెళ్లాలంటే అసలు వీలు కావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈరోడ్డుకి తక్షణమే మరమ్మతులు చేపట్టి రోడ్డు బాగు చేయించాలని స్థానిక ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

బూర్జ: పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం

ప్రజాశక్తి- బూర్జ

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తమ ప్రభుత్వంలో అమలు జరుగుతుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వృద్ధులకు, వితంతువులకు రూ.3 వేలు నుంచి రూ.4వేలకు పింఛను పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ప్రస్తుతం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తుందన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, విద్యార్థులకు విద్యా దీవెన, తల్లికి వందనం వంటి కార్యక్రమాలను అమలు చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. అర్హులైన ప్రతిఒక్క లబ్ధిదారునికి అన్ని రకాల పథకాలను అమలు చేసేందుకు సంసిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు, టిడిపి నాయకులు వెంకటరమణ, శ్రీనివాసరావు, ఎంపిటిసి పోలినాయుడు, మాజీ సర్పంచ్ నానుపాత్రుని సత్యం, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : బావి పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాకుళం రూరల్: ప్రతి పేదవాని కళ్లల్లో ఆనందం చూడాలనేదే టిడిపి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని పొన్నాంలో శనివారం పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని పింఛనుదారులకు పింఛను అందజేశారు. అనంతరం పంచాయతీలో నవనంబాడు, గొల్లపేటలో సిసిరోడ్లు, కాలువలను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ గణపతిరావు, ఎంపిడిఒ బొడ్డేపల్లి శైలజ, వంకాయల ప్రకాష్, లక్ష్మణరావు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకోం

కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ప్రశ్నల వర్షం

ప్రజాశక్తి- పలాస

ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ సూర్యనారాయణ (మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు)

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గత నాలుగేళ్లుగా నిర్వహిస్తున్న అభివృద్ధి పనులపై విజిలెన్స్, ఇతరాత్రా శాఖలకు ఫిర్యాదులు చేస్తూ బిల్లులు కాకుండా అడ్డుకుంటున్న మున్సిపాలిటీకి చెందిన ఒకే ఒక వ్యక్తి బుల్లు ప్రధాన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చైర్మన్‌తో సహా సభ్యులందరూ మూకమ్మడిగా తీర్మాణం చేశారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన శనివారం సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధిపై లేనిపోని ఫిర్యాదులు ఉన్నతాధికారులకు బుల్లు ప్రధాన్ అనే వ్యక్తి చేయడం వల్ల కాంట్రాక్టర్ బిల్లులు అందడంలేదని కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ, దువ్వాడ శ్రీకాంత్, సనపల సింహాచలం, దుర్గా శంకర్ పండా ఆందోళన వ్యక్తం చేశారు. అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకొని అడ్డుకట్ట వేయకపోతే ఉన్న ఒక ఏడాదిలో కూడా అభివృద్ధి చేయలేమని ఆవేదన వ్యక్తం చేశారు. చైర్మన్ మాట్లాడుతూ మూడు రోజుల క్రితమే ముఖ్యమంత్రి కార్యాలయానికి మూడు పేజీలు లేఖ బుల్లు ప్రధాన్ రాసినట్లు తమకు తెలిసిందని అన్నారు. కాశీబుగ్గ ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ రోడ్డు వేసి పది రోజులు కాకముందే దీనిపై బుల్లు ప్రధాన్ విజిలెన్స్‌కు పిర్యాదు చేసినట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఇలా అయితే మున్సిపాలిటీలో అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. దీనిపై కౌన్సిలర్లు మాట్లాడుతూ ఇలాంటి ఫిర్యాదలపై ప్రజాప్రతినిధులు తప్పుకోగలరని అధికారులు ఇబ్బందుల్లో పడే అవకాశం ఉందని, అందువల్ల అయనపై ఇప్పటికే ఎమ్మెల్యే గౌతు శిరిషాకు ఫిర్యాదు చేశామన్నారు. కలెక్టర్, ఐజి వంటి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరగా, దీనిపై సభ్యులంతా ఆమోదించారు. అజెండా కాపీ అందులో అంశాలు సభ్యులు చర్చించి ఆమెదించాల్సి ఉండగా, సభ్యులు కన్నా ముందుగా సోషల్ మీడియాలో చక్కర్లు చేయడం ఏమిటని కౌన్సిలర్ శ్రీకాంత్ ప్రశ్నించారు. దీని వల్ల ఏయే అంశాలు చర్చకు రానున్నయి అనే అంశాలు ప్రజలకు ముందుగానే తెలిసిపోవడం వల్ల తమకు పలువురు ఫోన్లు చేసి అంశాలు గురించి అడుగుతున్నారని అన్నారు. అభివృద్ధి పనుల్లో కౌన్సిలర్లు ప్రాధాన్యత ఇచ్చి ఫొటో కాల్ పాటించే అవసరం లేదా? అని కౌన్సిలర్ దుర్గాశంకర్ పండా, కర్రి మాధవరావులు ప్రశ్నించారు. సమావేశంలో వైస్ చైర్మన్ బోర బుజ్జి, కౌన్సిలర్లు సవర సోమేశ్వరరావు, అజయ్, పి.ప్రసాద్, జోగ త్రివేణి, తంగుడు ఆశాలత, దున్న బళ్ల రేవతి, మున్సిపల్, రివెన్యూ, విద్యుత్, మెప్మా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా థియేటర్‌లో తనిఖీ

పలాస: జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక అధికారులు భాస్కరరామ థియేటర్‌ను తనిఖీలు చేశారు. సినిమా హాల్‌లోని ఉండే అనుమతులు థియేటర్‌లో ఉండే సౌకర్యాలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం సినిమా ప్రదర్శనలు జరుగుతున్నాయో? లేదో? ఆరా తీశారు. ప్రేక్షకులకు అమ్మకాలు చేస్తున్న టిక్కెట్ రేట్లను పరిశీలించారు. దీనిలో భాగంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయం పక్కన ఉన్న భాస్కరరామ థియేటర్‌లో సినిమా ప్రదర్శనలకు లైసెన్స్ రెన్యువల్ చేయకపోవడంతో సినిమా ప్రదర్శనలు నిలుపుదల చేసినట్లు తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి తెలిపారు.

ముగిసిన క్రీడా శిబిరం

టెక్కలి : టెక్కలి మండల వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షాణా శిభిరం శనివారంతో ముగిసింది. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు కాపల రఘునాథరావు మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ఆలోచించి క్రీడలపై మక్కువ కల్పించే విధంగా శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాడాన నారాయణరావు మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయుల సహాయ, సహకారాలతో అథ్లెటిక్స్‌లో వివిధ రకాల క్రీడలపై ఆసక్తి కల్పించే విధంగా శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కె.కె.రామిరెడ్డి, లక్ష్మణరాజా, కుప్పిలి ప్రకాష్, నాగళ్ల రమేష్, ఆదిశేషు, అలివేణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

లక్ష్మీభాయి సేవలు అమోఘం

టెక్కలి రూరల్ : ఎంపిడిఒ చింతాడ లక్ష్మీభాయి అంకితభావంతో పనిచేశారని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి అన్నారు. పరిషత్ కార్యాలయం ఆవరణలో లక్ష్మిబాయి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం లేకుండా పనిచేశారని అన్నారు. 30 ఏళ్ల పాటు ఎంపిడిఒగా బాధ్యతలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కోటబొమ్మాళి ఎంపిడిఒ ఫణీంద్రకుమార్, టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు, గణపతిరావు, సర్పంచ్ గురువెల్లి బాలకృష్ణ, రామచంద్రరావు పాల్గొన్నారు

రూ.1.50 లక్షలు ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూడిజగన్నాథపురానికి చెందిన దుమ్ము ఏకాంబరం రైలు ప్రమాదంలో కుడికాలు పోగొట్టుకున్నాడు. అదే గ్రామానికి చెందిన హ్యాండ్స్ టుగెదర్ ట్రస్టు ప్రతినిధులు శనివారం రూ.1.50 లక్షలు ఆర్థికసాయం చేశారు. అత్యవసర వైద్యం కోసం ట్రస్టు ప్రతినిధులు అతని ఇంటివెళ్లి మేమున్నాం అంటూ ధైర్యం చెప్పి ఆర్థికసాయం అందించారు. ఆయన కుటుంబ సభ్యులు ట్రస్టు ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు ఆదినారాయణ, కోదండరావు, గణపతి, సింహాచలం, వెంకటరమణ, భాస్కర్ పాల్గొన్నారు.

విత్తన ఎంపిక కీలకం

మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ

సరుబుజ్జిలి: నేలసారం, విత్తన ఎంపిక చాలా కీలకమని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ అన్నారు. శనివారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని సరుబుజ్జిలి మండలం ఇసుకలపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సన్నద్ధతపై రైతులను సిద్ధం చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు అందజేసే సేవలను సాంకేతిక పద్ధతులను రైతులకు వివరించారు. రైతులు విత్తనాలు, ఎరువులు, నేలసారం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని సాగుకాలంలో ఏర్పడే ఇబ్బందులను ఎదుర్కోవచ్చునని తెలిపారు. కెవికె ద్వారా అందిస్తున్న ముంపును తట్టుకునే విత్తన రకాలను రైతులు వేసుకోవడం మంచిదని, వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పశుపోషణ, కోళ్ల పెంపకం, చేపల పెంపకంతో రైతుకు ఆదాయం చేకూరుతుందన్నారు. వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ గాంధీ మాట్లాడుతూ నూతన రకాలైన సిఆర్ దాన్ 801, 802 వంటివి వేసుకోవచ్చని తెలిపారు. అనంతరం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త శ్రీనివాస్ మాట్లాడుతూ పచ్చిరొట్ట పంటల ప్రాముఖ్యం, సహజ పద్ధతులతో భూసారాన్ని పెంచుకునే విధానం, విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వాణిజ్య వ్యవసాయ పరిశోధన స్థానం రాజమండ్రి శాస్త్రవేత్త శైలజ పంటల్లో సమగ్ర యాజమాన్య విధానాలు, వ్యవసాయ పరిశోధన విధానాలను వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కె.రమణమ్మ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఒ దానకర్ణుడు

కౌలు రైతులకు అవగాహన

మెళియాపుట్టి: మండలంలోని గోకర్ణపురం, గొప్పిలి రైతు సేవా కేంద్రం పరిధిలో ఎఒ ఎస్.దానకర్ణుడు కౌలు రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు చేస్తున్న రైతులు గ్రామ రెవెన్యూ అధికారికి, గ్రామ వ్యవసాయ సహాయకులకు దరఖాస్తు చేసుకుని భూమి సాగు హక్కు పత్రం పొందవచ్చునని తెలియజేశారు. భూమిసాగు హక్కు పత్రం పొందిన రైతులకు విధిగా ప్రభుత్వం వ్యవసాయశాఖ నుంచి అందించే పథకాలు అందుతాయని తెలిపారు. భూమి సాగు పత్రం 11 నెలలు కాలపరిమితి ఉంటుంది అని తెలిపారు. భూయజమానులు కౌలుదార్ రైతులకు సహకరించి కౌలు రైతులకు భూమి సాగు హక్కుపత్రాలు పొందే విధంగా సహాయ పడాలని కోరారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు సింహాచలం, నరేష్, వాసు, పావని, సర్పంచ్ రవి, ఢిల్లీరావు, రవి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

శానిటేషన్ పనులను పర్యవేక్షిస్తున్న తహశీల్దార్, ఎంపిడిఒ

లావేరు: గ్రామంలోని ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, వేడినీళ్లు, వేడి పదార్థాలను తీసుకోవాలని తహశీల్దార్ మంగం రాజశేఖర్, ఎంపిడిఒ పి.వెంకటరాజు అన్నారు. మండలంలోని కొత్తకుంకాంలో డయేరియారియా ప్రబలిన విషయం తెలిసిందే. శనివారం గ్రామంలో మండల స్థాయి అధికారులు పర్యటించి ప్రజలతో మాట్లాడారు. శానిటేషన్ పనులను పరిశీలించారు. వైద్య సిబ్బంది గ్రామంలో మరో మూడు రోజులు పాటు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది, ఆశా, అంగన్వాడీ, సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడారు.

సోంపేట : స్టిక్కర్లను అంటించిన సిఐ మంగరాజు

సురక్షిత ప్రయాణానికే క్యూఆర్ కోడ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రయాణికులు సురక్షితంగా ప్రయాణించడానికే ఆటోలకు క్యూఆర్ కోడ్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందని సిఐ పి.సత్యనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని పాలపోలమ్మ ఆటోస్టాండ్ యూనియన్‌లోని ఆటోలకు క్యూఆర్ కోడ్ నంబర్ స్టిక్కర్స్ అంటించడం జరిగిందని తెలిపారు. ఎస్‌పి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఆటోలో ప్రయాణించే ప్రయాణికులు పాసింజర్ వైపు అంటించబడిన క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసి ఏదైనా ప్రమాదం జరిగినా లేదా అనుమానం కలిగినా వెంటనే స్కాన్ చేసిన యెడల ఆటోకి సంబంధించిన పూర్తి వివరాలు ఫోన్‌లో కనిపిస్తాయని తద్వారా నేరాలను అదుపు చేయడానికి ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలో గల అన్ని ఆటోలకు ఇదే విధంగా క్యూఆర్ కోడ్, నంబర్ స్టిక్కర్స్ అతికించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సనపల బాలరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట : సోంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో తిరుగుతున్న సుమారు 140 ఆటోలకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను సిఐ మంగరాజు ఆధ్వర్యాన శనివారం అతికించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ క్యూఆర్ కోడ్ స్టికర్ల ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులు తాము ప్రయాణం చేసే సమయంలో భద్రతాపరమైన సమస్య ఎదురైనప్పుడు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ లవరాజు, సిబ్బంది అప్పలనాయుడు, విజయ్, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో మృతదేహం

టెక్కలి రూరల్ : టెక్కలి ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో మృతిదేహం శనివారం లభ్యం కావడంతో కలకలం రేపింది. గమనించిన సిబ్బంది పోలీసుల సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించగా, కోటబొమ్మాళి మండలం హరిచంద్రపురం పంచాయతీ సాలిపేటకు చెందిన చలపాక తారకేశ్వరరావు (40)గా గుర్తించారు. అయితే తారకేశ్వరరావు కొంత కాలంగా మద్యానికి బానిసై భార్య విడిచి పెట్టేశారని తమ్ముడు గణేష్ తెలిపారు. మూడు రోజుల నుంచి మద్యం తాగుతూ ఆహారం తీసుకోపోవడంతో మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయలేదు.

జూదరుల అరెస్టు

పలాస : మండలంలోని తర్లాకోట వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శనివారం దాడి చేసి ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేసినట్లు చేశామని కాశీబుగ్గ ఎస్‌ఐ ఆర్.నరసింహమూర్తి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,42,270 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే రెండు బైక్‌లు సీజ్ చేశామని తెలిపారు. ఈ దాడితో కాశీబుగ్గ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తవ్విన కాలువలోకి దిగిన వాహనం

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ఒకటవ వార్డు పరిధిలోని పార్వతీశుని పేట జంక్షన్ సమీపంలో శనివారం తృటిలో ప్రమాదం తప్పింది. సిఎస్‌పి రోడ్డు నుంచి ఎబి రోడ్డు వరకు ఉన్న ఈ రహదారి పక్కన కాలువ తవ్వి నిర్మాణం చేపట్టకుండా విడిచిపెట్టారు. ఈ రహదారిలో ఉదయం 9 గంటల సమయంలో ఎబి రోడ్ నుంచి బొలెరో పికప్ వ్యాన్ సిఎస్‌పి రహదారికి వెళ్తున్న సమయంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కాలువలో దిగిపోయింది. అయితే ఆ సమయంలో వ్యాన్‌లో మనుషులు, బరువులు లేకపోవడంతో డ్రైవర్ చాకచక్యంగా ఎటువంటి ప్రమాదం లేకుండా తప్పించుకున్నాడు. గడచిన కొద్ది రోజులుగా కాలువ తవ్వి విడిచి పెట్టడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పురపాలక సంఘ అధికారులు కాలువ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

ఓటర్ల జాబితా సవరణకు సహకరించాలి

టెక్కలి : టెక్కలి నియోజకవర్గ ఓటర్ల జాబితా సవరణకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి కోరారు. టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఓటర్ల జాబితాలో ఉన్నవారి పేర్లు మార్పులు, చనిపోయిన వారి పేర్లు తొలగింపుకు సంబంధించి ధ్రువపత్రాలు పత్రం తప్పనిసరిగా ఉండాలన్నారు. కొత్తగా ఓటుహక్కు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో టెక్కలి, కోటబొమ్మాళి టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, బోయిన రమేష్, కాంగ్రెస్ పార్టీ తరుపున టంకాల బాలగంగాధర్ గుప్త, వైసిపి నుంచి హనుమంతు వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నుంచి మెట్ట అవినాష్, బిజెపి నుంచి శ్రీరామ్మూర్తి, మణి పాల్గొన్నారు.

నాటుసారా అరికట్టేందుకు చర్యలు

బేబి, ఎక్సైజ్ సిఐ

సోంపేట: నాటుసారాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు నవోదయం 2.5 కార్యక్రమం ద్వారా చర్యలు చేపడుతున్నట్లు సోంపేట ఎక్సైజ్ సిఐ కె.బేబీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి 31 వరకు చేపట్టిన దాడుల్లో ఆరు కేసులు నమోదు చేశామన్నారు. 104 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడం, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా నాటు సారాను తయారు చేసినా, విక్రయించినా, రవాణాకు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి వసంతరెడ్డి

'వెన్నుపోటు'కు సన్నద్ధం కావాలి

నౌపడ : సంతబొమ్మాళి మండలంలో జూన్ 4న నిర్వహించనున్న వెన్నుపోటు కార్యక్రమానికి వైసిపి నాయకులు సిద్ధం కావాలని జెడ్‌పిటిసి వసంతరెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వైసిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మోహన్‌రెడ్డి, అంగ జనార్ధన్, అంగ మల్లేష్, బత్తిన ఫకీర్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

అంతిమ యాత్రి నిర్వహిస్తున్న గ్రామస్తులు

కోటబొమ్మాళి: మండలంలోని సరియాపల్లి మాజీ సర్పంచ్ అన్నపూర్ణమ్మ (95) మృతి చెందారు. మండలంలోని సరియాపల్లికు చెందిన వెలమల అన్నపూర్ణమ్మ (95) శుక్రవారం రాత్రి మృతి చెందింది. అమె గత రెండు రోజులుగా అస్వస్తతకు గురై స్వగ్రామంలోనే తుదిశ్వాస విడిచారు. ఈమె గ్రామ సర్పంచ్‌గా ఐదేళ్ల పాటు తన గ్రామానికి సేవలు అందించారు. కుమారుడు కామేశ్వరరావు మూడు పర్యాయాలు ఎంపిపి ప్రతినిధిగా, ఒక పర్యాయం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రతినిధిగా తన సేవలు అందించారు. పెద్ద కుమారుడు మాధవరావు విఆర్‌ఒగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. చిన్నకుమారుడు అప్పలనాయుడు న్యాయవాదిగా పనిచేస్తున్నారు. వివాహితులైన ఇరువురు కుమార్తెలు ఉన్నారు. పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, ఎంపిటిసి మాజీ సభ్యులు పట్ట సింహాచలం, మాజీ సర్పంచ్ శిమ్మ నారాయణరావు, కింజరాపు విశ్వనాథం, నాళ్ల చిన్ని ఆమె అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

సంఘీభావం తెలుపుతున్న కృష్ణారావు తదితరులు

పారిశుధ్య కార్మికుల నిరసనకు సంఘీభావం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ ఉద్యోగులు చేపడుతున్న సరసన, నిరవధిక సమ్మెకు డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు శనివారం తన పూర్తి సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగులు ప్రధానమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాల్సిన బాధ్యత ఉందని, గత ప్రభుత్వం వీరిపై చిన్నచూపు చూసిందని, కూటమి ప్రభుత్వమైన ప్రధానమైన డిమాండ్లు, ఉద్యోగ కేటగిరి వేజ్‌గా జీతాలు క్రమబద్ధీకరించాలని, పూర్తి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈయనతో కెవిఎల్ఎస్ ఈశ్వరి, డిసిసి ఉపాధ్యక్షులు సాయిదుల్లాఖాన్, ప్రధాన కార్యదర్శి, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు చాంద్ బాషా, అంబటి లక్ష్మణరావు, డిసిసి జాయింట్ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

పొగాకు ఉత్పత్తులకు యువత దూరంగా ఉండాలని కింజరాపు ఎర్రంనాయుడు కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ కె.మోష్ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ, కింజరపు ఎర్రంనాయుడు కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్స్ సహకారంతో అవగాహన ర్యాలీని ఎస్ఎస్ఆర్ పురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ మాట్లాడుతూ యువత పెడత్రోవ పట్టకుండా, క్రమశిక్షణతో నడుచుకోవాలని, పొగాకుకు దూరంగా ఉండి ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. గుట్కా, పాన్‌మసాలా, చుట్ట, బీడీ, సిగరెట్ తదితరమైన వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో పొగాకు వినియోగం, దుష్పరిణామాలు వివరిస్తు నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె. సత్య నారాయణ, పి.చైతన్య కుమార్, జి.రమణ, ఉమాశంకర్, కళాశాల సిబ్బంది, రెడ్‌క్రాస్ కో-ఆర్డినేటర్, ఎన్ఎస్ఎస్ ఇన్‌ఛార్జి బి.అనసూయమ్మ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి క్యాంపునకు బయలు దేరుతున్న విద్యార్థులు

ఎన్‌సిసి క్యాంపునకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండల పురపాలక సంఘంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎన్‌సిసి క్యాంపుకు ఎంపికయ్యారు. జిల్లాలోని టెక్కలిలో ఉన్న ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్మెంట్ కాలేజ్‌లో జరిగే ఎన్‌సిసి క్యాంప్‌నకు సుమారు 50 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. పట్టణం నుంచి విద్యార్థులందరూ శనివారం ఆర్‌టిసి బస్సులో బయలుదేరి వెళ్లారు. మే 31 నుంచి జూన్ 9 వరకు జరిగే ఎన్‌సిసి క్యాంపులో పాల్గొంటారని ఎన్‌సిసి ఫస్ట్ ఆఫీసర్ ఎం. మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రాములు, ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్ బి. సెరత్‌కుమారి, తుమ్మా సాంబమూర్తి, విద్యార్థుల తల్లిదండ్రులు బీవల్గొన్నారు.

వివరిస్తున్న నాగరాజు

హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సంస్థ జునైద్ అహ్మద్ మౌలానా ఆదేశాల మేరకు స్థానిక న్యాయ సేవా సదన్ నందు మోటారు యాక్టు, ట్రాఫిక్ నియమ నిబంధనలు గురించి స్థానిక పారా లీగల్ వాలంటీర్లకు శనివారం వివరించారు. ద్విచక్ర వాహనం నడుపుతున్నప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. వాహనం నడిపేటప్పుడు ఎటువంటి మద్యం కూడా సేవించరాదని, వాహనదారులకు పూర్తిగా పేపర్లన్నీ ఉండాలన్నారు. తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచనలు చేశారు. కూడళ్లలో వాహనం వేగాన్ని తగ్గించి నెమ్మదిగా వెళ్లాలని, ట్రాఫిక్ కూడళ్లలో ఏర్పాటు చేసిన సిగ్నల్‌లను విధిగా ఆచరించాలని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు వాహనాలు నడిపితే తల్లిదండ్రులే బాధ్యత వహిస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.నాగరాజు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

తేలని ట్యాక్సీ స్టాండ్ వివాదం

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలిలో ప్రస్తుతం ఉన్న ట్యాక్సీ స్టాండ్ వివాదం రోజురోజుకూ ముదురుతుంది. ఒకప్పుడు స్థానిక ఇందిరాగాంధీ కూడలి వద్ద ఉన్న ఈ టాక్సీ స్టాండ్‌ని తాజాగా మార్చారు. ఇప్పుడు పట్టుమహదేవి కోనేరు గట్టుపై ఉన్న ట్యాక్సీ స్టాండ్‌ని ఎత్తివేయాలని రెవెన్యూ అధికారులు కోరారు. కోనేరు గట్టు అభివృద్ధి, అన్న క్యాంటీన్ నిర్మాణం నిమిత్తం టాక్సీ స్టాండ్‌ను ఎత్తివేయాలని సూచించారు. అయితే దశాబ్దాల కాలం నుంచి ఇక్కడే స్టాండ్ ఏర్పాటు చేసుకుని వాటినే నమ్ముకుంటు సుమారు 70 వాహనాల ద్వారా వంద వరకు కుటుంబాల వారున్నారు. ఇప్పటికప్పుడే ట్యాక్సీ స్టాండ్‌ని తరలించి ఎత్తివేయాలంటే ఎలా? అని కార్మికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అయితే స్థానిక బస్‌స్టాండ్ సమీపం ఆంజనేయ స్వామి ఆలయం పక్క ఉన్న స్థలంలో టాక్సీలు పెట్టుకోవాలని సూచించారు. స్థలాన్ని చదును చేసి అప్పగిస్తామని, అవసరమైతే స్థలం వినియోగంలో భాగంగా రశీదులు కూడా అందిస్తామని రెన్యూ అధికారులు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో మాటిచ్చారని టాక్సీ కార్మికులు అంటున్నారు. వీరి హామీలో ఆలయం స్థలంలోని వచ్చిన ట్యాక్సీలు కొద్ది రోజులు పాటుగా అక్కడే ఉంచారు. అధికారులు సూచించిన స్థలంలో ట్యాక్సీ స్టాండ్ కార్మికులు ఉండేందుకు చిన్నపాటి గది కూడా నిర్మాణం చేసుకుంటామని అనుమతి కోరుతూ రెవెన్యూ అధికారులను సంప్రదించారు. అయితే స్థలం అప్పగింతపై ఇంకా ఎటువంటి అనుమతులు రాలేదని, నిర్మాణాలు ఏమీ చేపట్టవద్దని రెవెన్యూ అధికారులు చెప్పారు. ట్యాక్సీ కార్మికుల వాదనలను వినిపించుకోకుండా తాత్సారం చేయడంతో మరలా వారు పట్టుమహదేవి కోనేరు గటుపైనే ట్యాక్సీలు నిలుపుదల చేయడం ప్రారంభిం చారు. దీనిపై రెవెన్యూ, పంచాయితీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్యాక్సీ స్టాండ్ ఏర్పాటుకు అంతరాయం కల్పించేందుకు చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. దశాబ్దాల కాలం నుంచి తమ సమస్య పరిష్కారానికి ఎవ్వరూ స్పందించడం లేదని కార్మికులు వాపోతున్నారు. వందాలాది మంది కార్మికులకు ఉపాధిగా ఉండే ట్యాక్సీ స్టాండ్ ఏర్పాటుపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

ట్యాక్సీ స్టాండ్

గ్రంథాలయంలో వక్తృత్వ పోటీలు

లావేరు: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ధూమపానం నిషేధం అనే అంశంపై విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందిన విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం ఆఖరి రోజున బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు వీరభద్రుడు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా సత్యంనాయుడు

ప్రజాశక్తి- రణస్థలం

సత్యంనాయుడు

వైసిపి అధ్యక్షులు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లాకు చెందిన నాయకులను పార్టీ 'రాష్ట్ర యువజన విభాగ కమిటీ'లో వివిధ హోదాల్లో నియమించారు. అందులో భాగంగా రణస్థలం మండల కేంద్రానికి చెందిన పిన్నింటి సత్యం నాయుడును రాష్ట్ర యువజన విభాగ కమిటీ జాయింట్ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపదవి కట్టబెట్టిన పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డికి, స్థానిక మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌కు, నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి సర్పంచ్‌లు, ఎంపిటిసిల విజయానికి, పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. అలాగే పార్టీ చేపట్టనున్న ప్రతి కార్యక్రమంలో పాల్గొంటానన్నారు. ఈ నెల 4న జరగనున్న వెన్నుపోటు దినం ర్యాలీ విజయవంతం అయ్యేందుకు కృషి చేస్తానని తెలిపారు.

కృష్ణ సినీరంగంలో మార్పుని తెచ్చారు

టెక్కలి : తెలుగు సినీ చిత్ర ప్రపంచంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన కృష్ణ సినీ ప్రపంచానికే వెలుగు వంటివాడని స్థానిక సుదర్శన థియేటర్ యజమాని సత్తారు వెంకటరమణ అన్నారు. జయంతి సందర్భంగా థియేటర్ వద్ద కృష్ణ చిత్రపటానికి శనివారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ బాలకృష్ణ, నాగరాజు, వెంకటేష్, నాని తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఒ శ్రీదేవి

గుర్తింపు కార్డు తప్పనిసరి

ప్రజాశక్తి- కవిటి

కౌలు రైతులకు తప్పనిసరిగా గుర్తింపు కార్డు ఉండాలని మండల వ్యవసాయ అధికారి పిరియా శ్రీదేవి సూచించారు. మండలంలోని బల్లిపుట్టుగలో కౌలు రైతులకు శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు రైతులు బ్యాంకులో రుణం తీసుకోవాలన్నా, ఇన్స్యూరెన్స్ చేసుకోవాలన్నా, వారికి ఈ పంట వర్తించాలన్న దానికి గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. దీనివల్ల భూమి సొంత యజమాని హక్కులకు ఎటువంటి నష్టం ఉండదని ఆమె తెలిపారు. కౌలు రైతులందరూ గుర్తింపు కార్డులు తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చిన్నబాబు, విఎఎ, రైతులు పాల్గొన్నారు.

క్రీడా వస్తువుల పంపిణీ

క్రీడా వస్తువులు అందిస్తున్న శ్వేత

కవిటి: మండలంలోని బి.జి.పుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు శనివారం క్రీడా వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శిక్షకుడు బల్లెడ రమేష్ మాట్లాడుతూ మరికొద్ది రోజుల పాటు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పశు గ్రాసాల సాగుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి:

మాట్లాడుతున్న పశు వైద్యాధికారి కిరణ్‌కుమార్

రాష్ట్ర ప్రభుత్వం, పశుసంవర్ధకశాఖ ఉపాధి హామీ ద్వారా బహు వార్షిక పశుగ్రసాల సాగును ప్రోత్సహించేందుకు సాగు ఖర్చులను ఇవ్వనుంది. అందుకోసం రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి పాడి రైతులకు పశుగ్రాసాల సాగుకు సాగు ఖర్చులకు ఆసరా కల్పిస్తుంది. రెండు, అంతకంటే ఎక్కువ సంవత్సరాలు సాగు చేయబడే పశుగ్రాసాన్ని బహు వార్షిక పశుగ్రాసం అంటారు. దీని పెంపకానికి సంవత్సరం పొడుగునా నీటి సదుపాయం ఉండాలన్నారు. పాడిరైతు వ్యక్తిగతంగా 10 సెంట్లు నుంచి 50 సెంట్లు వరకు సాగు చేసుకోవచ్చును. ఉపాధి హామీ నిధులు సంవత్సరం వరకు మాత్రమే ఇవ్వబడతాయి. 10 సెంట్లు విస్తీర్ణంలో సాగుచేసే పాడి రైతుకు కూలీ వేతన ఖర్చు రూ. 3వేలు, మెటీరియల్ ఖర్చు రూ.3,599, మొత్తం ఖర్చు 6,599 అందిస్తుందన్నారు.

50 సెంట్లు సాగు చేసే ఒక పాడి రైతుకు సాగు ఖర్చు కింద కూలీ వేతన ఖర్చు రూ.15 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.17992 మొత్తం ఖర్చు రూ.32,992 లు ఇవ్వనుందన్నారు.

గ్రామ రైతు సేవా కేంద్రంలో పశుసంవర్ధక సహాయకునికి అప్లికేషన్ ఫారంతో పాటు గ్రామసభ తీర్మానం, జాబ్ కార్డు జిరాక్స్, 1బి జిరాక్స్, రైతు ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్ జత చేయాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో పంటలు సాగు

అవగాహన కల్పిస్తున్న డిపిఎం సత్యనారాయణ

ఆమదాలవలస: ముందస్తు రుతు పవనాలు రాక రైతులకు మేలు చేస్తాయని, రైతులందరూ తప్పకుండా ప్రకృతి వ్యవసాయ సాగును చేయాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యనారాయణ అన్నారు. శనివారం మండల కార్యాలయంలో మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులందరూ జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగును చేపడతారని, ఈ వరి పంట వేయడానికి ముందుగా ప్రకృతి సేద్య పద్ధతిలో నవధాన్య సాగును చేపట్టాలన్నారు. దీనివలన నేలకు, పంటకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను రైతులు వద్దకు నేరుగా తీసుకెళ్తూ ప్రకృతి వ్యవసాయంలో ఉన్నటువంటి పద్ధతులను రైతులతో చేసేలా తగిన ప్రోత్సాహాన్ని ఇస్తున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయం వలన నేలకు, వాతావరణానికి ఎటువంటి హాని కలగకుండా స్వచ్ఛమైన పంట ఉత్పత్తులను సమాజానికి అందించ వచ్చునని అన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మంచి గుర్తింపును ఇస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ హర్షవల్లి అధ్యక్షునిగా సత్యస్వరూప్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సత్యస్వరూప్‌ను అభినందిస్తున్న ప్రతినిధులు

లయన్స్ క్లబ్ హర్షవల్లి నూతన అధ్యక్షులుగా డా.సత్యస్వరూప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని లైన్స్‌క్లబ్ హర్షవల్లి శ్రీకాకుళం వ్యవస్థాపకులు హారికా ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళంలోని క్లబ్ కార్యాలయంలో శనివారం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగిందని, కార్యదర్శిగా సత్యవరపు లక్ష్మణరావు, కోశాధికారిగా కె.పార్వతీశ్వర రావు, ఉపాధ్యక్షులుగా టిఎ చంద్ర శేఖర్, పి.మధు బాబు, క్లబ్ డైరెక్టర్ నాగమణి పంగపల్లి, సర్వీస్ చైర్‌పర్సన్‌గా గౌతమ్ గుడ్ల, మార్కెటింగ్ చైర్‌పర్సన్‌గా సుమన్, ఎల్‌సిఐఎఫ్ కో-ఆర్డినేటర్‌గా వెంకునాయుడు, మెంబర్‌షిప్ కమిటీ చైర్‌పర్సన్‌గా నీహార్ చందక ఎన్నికయ్యారన్నారు. జూలై 1 నుంచి 2026 జూన్ 30 వరకు ఈ నూతన కార్యవర్గం పనిచేస్తుందని జోన్ చైర్మన్ కె.శోభారాణి, ఆర్‌సి డాక్టర్ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా డా.సత్యస్వరూప్ మాట్లాడుతూ నిర్విరామ సేవలు కొనసాగిస్తామని, కష్టపడి కాకుండా, ఇష్టపడి పనిచేసి క్లబ్‌కు మరింత పేరు, ప్రఖ్యాతలు తీసుకువస్తామన్నారు.

దళితుల హక్కుల పరిరక్షణకు చర్యలు

మాట్లాడుతున్న తహశీల్దార్ మురళీమోహన్

ప్రజాశక్తి- కవిటి

దళితుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి హక్కులకు భంగం కలిగేలా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ మురళీమోహన్ హెచ్చరించారు. కవిటి సచివాలయం ప్రాంగణంలో శనివారం మానవ హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితులకు ప్రభుత్వం కల్పించిన భూములను ఎవరైనా అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. దళిత గ్రామాల్లో ఎనిమిది నుంచి పీజీ చదివే విద్యార్థులకు వసతి సదుపాయం అవసరమైతే తమ దృష్టికి తీసుకువస్తే వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. సర్పంచ్ పూడి లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను దళితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బెందాళం రమేష్, ఆరింగి మధు, ఆరింగి త్రివిక్రమరావు, ఆరింగి కృష్ణారావు, విఆర్ఒ సల్ల నారాయణ, స్థానిక దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణపై చర్యలేవీ?

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ సమస్యలు కౌన్సిల్‌లో చర్చిద్దాం అనే ఉద్దేశంతో ఏడు రోజుల ముందు ప్రశ్నలు రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపించానని, అయినా చైర్‌పరసన్ ఎజెండాలో పొందుపర్చలేదని వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ ఏడాది ఏప్రిల్ 30న నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో పల అభివృద్ధి పనలను నామినేషన్ పద్ధతిలో రిజిస్టర్డు కాంట్రాక్టర్లకు అప్పగించానని అన్నారు. డైలీ మార్కెట్ ఎదురుగా పాత సూపర్ బజార్ స్థలంలో నిర్మించిన ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ మెట్ల వద్ద ఉన్న ఖాళీ స్థలంలో నిర్మితమైన అనధికార షాప్‌రూమ్ గురించి సమాధానం ఇవ్వలేదన్నారు. జీరో అవర్‌కు అవకాశం ఇవ్వకుండా తప్పించుకున్నారని తెలిపారు. ఈ అంశాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు.

అక్రమంగా కట్టిన షాపు

డిగ్రీలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజ్శాక్తి- టెక్కలి

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి నోటిపికేషన్ జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో పనిదినాల్లో దరఖాస్తులు ఉచితంగా ఆందిస్తున్నట్లు పేర్కొన్నారు. బిఎ, బికాం, బిఎస్‌సి సైన్స్ కోర్సులతో పాటు ఉపాధి ఆవకాశాలు లభించే టెక్నికల్ కోర్సులూ అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించే విద్యార్థులందరూ దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. అదేవిధంగా దూరప్రాంత విద్యార్థులకు వసతిగృహ సౌకర్యం ఉంటుందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి డబుల్ మేజర్ విధానం అమలులోకి వస్తుందని తెలిపారు. జూన్ 30 వరకు దరఖాస్తులు స్వీకరణ ఉంటుందన్నారు. తర్వాత వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రారంభించిన మాజీ ఎంపిపి రామకృష్ణ

పవర్‌టిల్లర్ ప్రారంభం

కోటబొమ్మాళి: రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ అన్నారు. మండలంలోని తిలారులో ప్రభుత్వ సబ్సిడీపై అందించిన పవర్‌టిలర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సహకారంతో ఈ పవర్‌టిల్లర్ మంజూరైందన్నారు. కావాల్సిన రైతులు ఇటువంటి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వెంకటరావుకు సన్మానం

ప్రజాశక్తి- కవిటి

క్రమశిక్షణ, సమయపాలన, చక్కని బోధనతో విద్యార్థుల మదిలో అక్షర జ్యోతి వెలిగించి ఉపాధ్యాయ వృత్తికే వన్నేతెచ్చిన వ్యక్తి సుంకర వెంకటరావు మాస్టారని సీనియర్ ఉపాధ్యాయులు జన్నెల శంకరరావు అన్నారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా 25 ఏళ్లు వివిధ పాఠశాలల్లో విధులు నిర్వర్తించి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆర్.బల్లిపుట్టుగలో శనివారం ఉద్యోగ విరమణ చేసిన వెంకటరావు మాస్టారుకు సన్మానించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యాయులు బల్లెడ లక్ష్మణమూర్తి, కొత్తపల్లి రంగారావు, బల్ల ధర్మారావు, గేదెల జానకిరావు, మొగలిపురి ఢిల్లేశ్వరరావు, అనుపోజు హిమకుమార్, లమ్మత మురళిధర్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న జడ్జి కిషోర్‌బాబు

పోక్సో చట్టంపై అవగాహన

ప్రజాశక్తి- సోంపేట

స్థానిక కోర్టుల సముదాయం వద్ద శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆరవ అదపు జిల్లా జడ్జి కె.కిషోర్ బాబు, సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాసరావు, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోక్సో చట్టంలోని కీలక అంశాలను గురించి వివరించారు. పనిచేసే చోట మహిళల పట్ల లైంగిక వేదిలింపూలకు పాల్పడితే కఠిన చర్యలు పడతాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు జగదీష్ పండ, చిత్రాడ శ్రీనివాసరావు, ఎన్.షణ్ముఖ, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి- నందిగాం

స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి విజ్ఞాన శిబిరములో భాగంగా ముఖ్య అతిథిగా నందిగాం మండలం టిడిపి యువనాయుకులు కొన్ని సతీష్, గ్రంథాలయ అధికారి ఎస్.ఉదయ్ కిరణ్ అధ్యక్షతన జూనియర్, సీనియర్ విద్యార్థులతో 'క్విజ్ పోటీలు' నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయంలో మరుగుదొడ్లు, బిల్డింగ్ మరమ్మతులు చేపడతానని గ్రంథాలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో రాములమ్మ, స్థానికులు, 28 మంది విద్యార్థులు పాల్గొన్నారు.